
సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా

సోమవారం । 22 । మే । 2023



చెరువు నిండుగా..

చిన్న, సన్నకారు రైతులకు సాగునీటి ఇబ్బందులు తీరనున్నాయి. చెరువుల అభివృద్ధిపై నిధులు మంజూరు చేసింది.

8లో



లోక కల్యాణార్థం పాదయాత్ర

లోక కళ్యాణార్థం ఐదు మండలాల్లో విశ్వ శాంతి సనాతన ధర్మ పరిరక్షణార్థం పాదయాత్ర ప్రారంభమైంది.

8లో



బ్రహ్మకమలాల కనువిందు

సాక్షి,పాడేరు: లగిశపల్లిలో మిలటరీ ఇంజనీరింగ్ శాఖ రిటైర్డ్ జేడీ అబ్బాయిదొర ఇంటి ఆవరణలో బ్రహ్మ కమలాలు వికసించాయి.

న్యూస్‌రీల్

నేడు రక్తదాన శిబిరం



రక్తదాన శిబిరం నిర్వహణపై అదనపు ఎస్పీతో మాట్లాడుతున్న ఎంపీడీవో

చింతపల్లి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశాల మేరకు సోమవారం రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో లాలం సీతయ్య తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో పోలీసుశాఖ సహకారంతో ఈ శిబిరం నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ వలంటీర్లు, గ్రామ సచివాలయ సిబ్బంది,ఉపాధ్యాయులు ఇతర శాఖల అధికారులు, ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు. రక్తదాన శిబిరం ఏర్పాట్లలో భాగంగా రెడ్ క్రాస్ సొసైటీ బృందంతో కలిసిన ఆయన చింతపల్లి అదనపు ఎస్పీ ప్రతాప్‌శివకిశోర్‌ను ఆదివారం కలిశారు. ఏర్పాట్లపై చర్చించారు.

అడ్వాన్స్‌కు పకడ్బందీ ఏర్పాట్లు

విశాఖ విద్య: ఇంటర్ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలకు పకడ్బందీగా ఏర్పాట్లు చేస్తున్నట్లు ఇంటర్ బోర్డు ప్రాంతీయ పర్యవేక్షణ అధికారి పి.ఉమారాణి వెల్లడించారు. ఆదివారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ ఈ నెల 24 నుంచి జరగనున్న పరీక్షలకు ఉమ్మడి విశాఖ జిల్లాలో 100 కేంద్రాలు కేటాయించినట్లు వెల్లడించారు. ఫస్టియర్ జనరల్ 41,929 మంది, ఒకేషనల్ 2,633 మంది కలిపి మొత్తం 44,562 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారని తెలిపారు. సెకండియర్ జనరల్ 16,979 మంది, ఒకేషనల్ 1,740 మంది కలిపి 18,719 మంది విద్యార్థులు హాజరుకానున్నారు. ఫస్టియర్ విద్యార్థులకు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, సెకండియర్ విద్యార్థులకు మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 వరకు పరీక్షలు జరుగుతాయన్నారు. ఒక నిమిషం ఆలస్యమైనా పరీక్షకు అనుమతించరని, విద్యార్థులు ముందుగానే పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలన్నారు. అన్ని కేంద్రాల్లో సీసీ కెమేరాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.


అనుమానితులు సంచరిస్తే సమాచారమివ్వండి: సీఐ



నుర్మతి-జి.మాడుగులలో తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసు బృందాలు

జి.మాడుగుల: గ్రామాల్లో అనుమానిత వ్యక్తులు సంచరిస్తే స్థానిక పోలీస్ స్టేషన్‌కు, పోలీస్‌లకు ప్రజలు సమాచారం అందించాలని సీఐ సత్యనారాయణ తెలిపారు. ఎస్పీ ఆదేశాల మేరకు మండల కేంద్రంలోని ప్రభుత్వ కార్యాలయాలు, ప్రధాన ప్రదేశాలను సీఐ అధ్వర్యంలో ఆదివారం పోలీసులు, బాంబ్ స్క్వాడ్, డాగ్ స్క్వాడ్‌లతో విస్తృత తనిఖీలు నిర్వహించారు. మండలంలో ప్రధాన రహదారులు, సెల్ టవర్లు, కల్వర్టులు, బ్రిడ్జిలు, విద్యుత్ సబ్ స్టేషన్, పెట్రోల్‌బంక్ ప్రజలు ఎక్కువగా సంచరించే ప్రాంతాలు, బస్ షెల్టర్ల వద్ద బాంబు, డాగ్ స్క్వాడ్‌లు తనిఖీలు చేపట్టాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో కొత్త వ్యక్తులు సంచరించినప్పుడు ప్రజలకు ఏమాత్రం అనుమానం వచ్చినా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ఆయన కోరారు. గ్రామాల్లో శాంతిభద్రత పరిరక్షణకు పోలీసులకు ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.

108లో సుఖ ప్రసవం



108 వాహనంలో తల్లీబిడ్డలు

వై.రామవరం: మండలంలోని నువ్వుగంటి పాలెం గ్రామానికి చెందిన గర్భిణి ఆదివారం 108 వాహనంలో ఆస్పత్రికి తరలిస్తుండగా మగశిశువుకు జన్మనిచ్చింది. గ్రామానికి చెందిన బలిజి ఆదిలక్ష్మికి శనివారం రాత్రి నుంచి పురిటి నొప్పులు ఎక్కువ అయ్యాయి. వెంటనే కుటుంబ సభ్యులు ఆదివారం ఉదయం 108కు సమాచారం అందించారు. అదే వాహనంలో చవిటి దిబ్బలు పీహెచ్‌సీకి ఆమెను తరలిస్తుండగా మార్గంమధ్యలో ప్రసవించింది. మగశిశువుకు జన్మనిచ్చింది. ఆశ వర్కరు సహాయంతో 108 సిబ్బంది ఈఎమ్‌టీ రామకృష్ణ, పైలట్ నవాజ్ ఆమెకు ప్రసవం చేశారు. తల్లీబిడ్డలు క్షేమంగా ఉన్నారు. వారిని చవిటిదిబ్బలు పీహెచ్‌సికి తరలించారు.

పులిమెట్టపై శ్రీనివాసుడు

రంపచోడవరం ప్రాంతంలో **పులిమెట్టపై** కలియుగదైవం **శ్రీవేంకటేశ్వరస్వామి,** పద్మావతి, గోదాదేవి అమ్మ**వార్లతోపాటు** గరుడాల్వార్, ద్వారపాలకు**ల విగ్రహాలను** వేదమంత్రాల మధ్య ఆది**వారం శాస్త్రోక్తంగా** ప్రతిష్టించారు. భక్తుల గోవిం**దనామ** స్మరణతో ఈ ప్రాంతం **మార్మోగింది. స్వామి** వారి కల్యాణం సోమవారం **అత్యంత** వైభవోపేతంగా నిర్వహించే**ందుకు తిరుమల** తిరుపతి దేవస్థానం అధికా**రులు ఏర్పాట్లు** పూర్తి చేశారు. కల్యాణోత్స**వాల్లో భాగంగా** ఆలయాన్ని శోభాయమానంగా తీర్చిదిద్దారు.

- వైభవంగా విగ్రహాల ప్రతిష్ట
- మార్మోగిన స్వామి నామస్మరణ
- నేడు మహాసంప్రోక్షణ, కల్యాణోత్సవం
- ఏర్పాట్లు పూర్తి చేసిన టీటీడీ



సోమవారం జరిగే సంప్రోక్షణ, కల్యాణం ఏర్పాట్లను పరిశీలిస్తున్న జేఈవో వీరబ్రహ్మం



గర్భాలయంలో పూజలు చేస్తున్న టీటీడీ చైర్మన్ సుబ్బారెడ్డి సతీమణి స్వర్ణలతారెడ్డి



ఆలయ శిఖరంపై కలశ స్థాపన చేస్తున్న తిరుమల తిరుపతి దేవస్థానం ఆలయ అర్చకులు

రంపచోడవరం: కలియుగ దైవం.. భక్తుల కొంగు బంగారం శ్రీ వేంకటేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ట రంపచోడవరం సమీపంలోని ఐ.పోలవరం జంక్షన్ వద్ద పులిమెట్ట పర్వత శిఖరంపై రుత్వికుల వేద మంత్రాల మధ్య ఆదివారం శాస్త్రోక్తంగా జరిగింది. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు వేంకటేశ్వరస్వామి, పద్మావతి, గోదాదేవి, గరుడాళ్వార్, ద్వారపాలకుల విగ్రహాలను పవిత్ర జలాలతో అభిషేకించారు. అంతకుముందు యాగశాలలో వైదిక కార్యక్రమాలు, రత్నన్యాసం, ధాతున్యాసం, ఆలయానికి, రాజగోపురానికి విమాన కలశ స్థాపన, విగ్రహస్థాపన నిర్వహించారు. సాయంత్రం 4 గంటలకు మహా శాంతి హోమం, పూర్ణాహుతి, చతుర్దశ కలశస్నపనం, నవకలశస్నపనం, మహా శాంతి తిరుమంజనం జరిపించారు. రాత్రి 8 గంటలకు యాగశాలలో వైదిక కార్యక్రమాలు, రక్షాబంధనం, శయనాధివాసం, విశేష హోమాలు చేపట్టారు. టీటీడీ చైర్మన్ వై.వి. సుబ్బారెడ్డి సతీమణి స్వర్ణలతారెడ్డి పూజాధి కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో జేఈవో వీరబ్రహ్మం, తిరుమల శ్రీవారి ఆలయ ప్రధానార్చకులు వేణుగోపాలదీక్షితులు, ఎస్ఈ సత్యనారాయణ, వీజీవో మనోహర్, డిప్యూటీ ఈవోలు గుణభూషణ్‌రెడ్డి, వెంకటయ్య, శివప్రసాద్, డిప్యూటీ ఈఈలు ఆనందరామ్, నాగభూషణం, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

కల్యాణోత్సవానికి ఏర్పాట్లు పూర్తి

ఆలయంలో సోమవారం మహాసంప్రోక్షణ, శ్రీవారి కల్యాణోత్సవం నిర్వహించేందుకు తిరుమల తిరుపతి దేవస్థానం ఏర్పాట్లు పూర్తిచేసింది. భారీ సంఖ్యలో తరలిరానున్న భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేయాలని టీటీడీ జేఈవో వీరబ్రహ్మం ఆదేశించారు.

నేటి కార్యక్రమాలు

- ఉదయం 5 గంటల నుంచి 8.15 గంటల వరకు సుప్రభాతం, యాగశాల కైంకర్యాలు. 8.15 గంటల నుంచి 8.45 గంటల వరకు మహా పూర్ణాహుతి జరుగుతుంది. 8.45 గంటల నుంచి 9గంటల వరకు యాత్రదానం, కుంభ ప్రదక్షణ, మిథున లగ్నంలో 9 నుంచి 9.30 గంటల వరకు కళావాహన, అక్షతారోహణ, బ్రహ్మఘోష , మహా సంప్రోక్షణ జరుగుతుందని టీటీడీ అధికారవర్గాలు తెలిపాయి.
- ఉదయం 10 గంటల నుంచి భక్తులకు స్వామివారి దర్శనం. ఉదయం 11 గంటలకు ధ్వజారోహణం, సాయంత్రం 5 గంటలకు శ్రీవారి కల్యాణోత్సవం. తిరువీధి ఉత్సవం, ధ్వజావరోహణం జరుగుతుందని ఆలయ అధికారవర్గాలు తెలిపాయి.

ఏర్పాట్లు పరిశీలన

వేంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రీవారి ఆలయ మహాసంప్రోక్షణ ఏర్పాట్లను ఆదివారం జేఈవో వీరబ్రహ్మం అధికారులతో కలిసి పరిశీలించారు. భక్తులందరూ దర్శనం చేసుకునేందుకు వీలుగా క్యూలైన్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఎండ తీవ్రత దృష్ట్యా భక్తులకు మజ్జిగ, తాగు నీరు, ప్రసాదాలు అందుబాటులో ఉంచాలన్నారు. ఎండ తీవ్రతకు గురికాకుండా అధిక సంఖ్యలో షెల్టర్లు ఏర్పాటుచేయాలని సిబ్బందికి సూచించారు. ఆలయాన్ని విద్యుత్తు, పుష్పాలంకరణలతో శోభాయమానంగా తీర్చిదిద్దాలన్నారు. వాహనాల, రద్దీ క్రమబద్ధీకరణకు స్థానిక పోలీసుల సహకారంతో తగిన ఏర్పాట్లు చేయాలని సూచించారు. అతిథులు భక్తులను ఉద్దేశించి మాట్లాడేందుకు అవసరమైన పబ్లిక్ అడ్రస్ సిస్టం ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో టీటీడీ చీఫ్ ఇంజనీర్ నాగేశ్వరరావు, పీఆర్వో డాక్టర్ రవి, ఈఈ సుధాకర్ పాల్గొన్నారు.



ఆలయ శిఖరంపై ప్రతిష్ఠించనున్న కలశాలతో అర్చకులు



ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న టీటీడీ అర్చకులు



అభిషేకం చేస్తున్న టీటీడీ చైర్మన్ సుబ్బారెడ్డి సతీమణి స్వర్ణలతారెడ్డి



భక్తులకు ప్రసాదం పంపిణీ

నాణ్యత లోపిస్తే నేరుగా ఫిర్యాదు చేయండి



చిలకలగెడ్డలో ఆర్వోప్లాంట్ నీటి నాణ్యతను పరీక్షిస్తున్న ప్రవీణ్‌ప్రకాష్



విద్యార్థి నుంచి వివరాలు తెలుసుకుంటున్న ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్‌ప్రకాష్



అరకులోయలో నాడు నేడు స్టాక్ పాయింట్‌ను పరిశీలిస్తున్న ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్‌ప్రకాష్

- రాష్ట్ర విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్‌ప్రకాష్

అనంతగిరి: విద్యాకానుక కిట్లల్లో నాణ్యత లోపిస్తే తనకు నేరుగా ఫిర్యాదు చేయాలని రాష్ట్ర విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్‌ప్రకాష్ సూచించారు. చిలకలగెడ్డ ఎంపీపీఎస్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను ఆయన సందర్శించారు. నాణ్యత పరమైన సమస్యలుంటే తెలిపేలా తన నంబరు 9013133636ను విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు షేర్ చేయాలని విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. నాడు-నేడు మొదటి విడతలోని 1.50 లక్షలతో ఏర్పాటు చేసిన ఆర్వోప్లాంట్‌ను ఆయన పరిశీలించారు. ఆర్వోప్లాంట్ వాడుతున్నారా లేదా అని హెచ్‌ఎంను ప్రశ్నించారు. అనంతరం వాటర్ ప్యూరిటీని ఏపీఈడబ్ల్యూఐడీసీ విశాఖపట్నం ఈఈ జగ్గారావుతో కలిసి పరీక్షించారు. ఆర్వోప్లాంట్‌లో లోపాలు ఉంటే సరిచేయాలని, ముందుగా వీటిపై అధికారులు అవగాహన కలిగి ఉండాలన్నారు. అనంతరం పాఠ్యపుస్తకాలు స్టాక్ రూమ్‌ను పరిశీలించి, విద్యాసంవత్సరానికి సంబంధించి, పాఠ్యపుస్తకాలు లోటులేకుండా చూడాలన్నారు. సీఆర్పీలు బాధ్యతగా పనిచేయాలని ఆదేశించారు. నాడు నేడు పనులను ఉన్నతాధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని, నాణ్యత లేకపోతే చర్యలు చేపట్టాలన్నారు.

విద్యార్థులతో మమేకం

చిలకలగెడ్డ గ్రామంలోని ఇంటింటికీ వెళ్లి, ప్రభుత్వ పాఠశాలలకు విద్యార్థులకు అందుతున్న సదుపాయాలను విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్‌ప్రకాష్ తెలుసుకున్నారు. విద్యార్థులతో మమేకమయ్యారు. విద్యార్థులు వర్క్‌బుక్‌ను పరిశీలించారు. వేసవి సెలవుల్లో ఇంటి వద్ద ఉంటున్న విద్యార్థులకు ఐరన్‌మాత్రలను అందించడంపై వైద్యసిబ్బంది తీరును అభినందించారు. ఈ కార్యక్రమంలోని డీఈవో సలీంబాషా, ఆర్‌జేడీ జ్యోతికుమారి, ఎంపీడీవో కుమార్, తహసీల్దార్ రాంబాయి, ఎంఈవో వెంకటరావు, ఏటీడబ్ల్యూవో వెంకటరమణ పాల్గొన్నారు.

అరకులోయ రూరల్: విద్యాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేసిందని రాష్ట్ర విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్‌ప్రకాష్ అన్నారు. జిల్లా పర్యటనలో భాగంగా శనివారం అర్ధరాత్రి స్థానిక ప్రభుత్వ సంక్షేమ గిరిజన ఆశ్రమ పాఠశాల(కంత భంసుగూడ)ను సందర్శించారు. నాడు-నేడు పనులు, జగనన్న స్టాక్ పాయింట్‌ను పరిశీలించారు. విద్యాబోధనపై ఆరా తీశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాభివృద్ధికి సమష్టిగా పనిచేయాలని సూచించారు. పాఠశాలల అభివృద్ధి పనుల్లో నాణ్యత లోపిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రభుత్వం అందిస్తున్న విద్యాకానుక కిట్లు ప్రతి విద్యార్థికి అందించాలన్నారు. విద్యబోధనపై ఉపాధ్యాయ సిబ్బంది మరింత శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఐటీడీఏ పీవో అభిషేక్, డీఈవో సలీంబాషా, ఆర్‌జేడీ జ్యోతికుమారి, ఎంఈవో భారతిరత్నం, సీఆర్పీ రమేష్, పాఠశాల హెచ్‌ఎం దయానిధి, సిబ్బంది పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదంలో ఏడిళ్లు దగ్ధం



అగ్ని ప్రమాదంలో బూడిదైన తాటాకిళ్లు



మంటలను అదుపు చేస్తున్న స్థానికులు, ఫైర్ సిబ్బంది

- రూ.20 లక్షల ఆస్తినష్టం
- సుమారు రూ.12 లక్షల నగదు బూడిద
- నిరాశ్రయులైన నాలుగు కుటుంబాలు
- సాయమందించిన పోలీసులు
- బొడ్రాయిగూడెంలో ఘటన

చింతూరు: మండలంలోని బొడ్రాయిగూడెంలో ఆదివారం జరిగిన అగ్నిప్రమాదంలో నాలుగు కుటుంబాలకు చెందిన ఏడు తాటాకిళ్లు అగ్నికి ఆహుతయ్యాయి. ఈ ఘటనలో గ్రామానికి చెందిన పులి బ్రహ్మయ్య, పులి కన్నయ్య, మిడియం భద్రమ్మ, మిడియం సారయ్యలకు చెందిన నాలుగు తాటాకు ఇళ్లతో పాటు మూడు వంటపాకలు దహనమయ్యాయి. ఇళ్లలో ఉన్న నగదు, బంగారంతో పాటు ధాన్యం, నిత్యావసరాలు, ఇతర సామగ్రి కాలి బూడిదవడంతో బాధిత కుటుంబాలు సర్వస్వం కోల్పోయి కట్టుబట్టలతో మిగిలాయి. ఈ ఘటనలో సుమారు రూ. 20 లక్షల వరకు ఆస్తినష్టం ఉంటుందని అంచనా.

ఇళ్లలో లేని సమయంలో..

అగ్నిప్రమాద సమయంలో బాధిత కుటుంబాలు ఇళ్లలో లేకపోవడంతో భారీగా నష్టం జరిగినట్లుగా తెలుస్తోంది. గ్రామానికి చెందిన మిడియం భద్రమ్మ వంటపాకలో చెలరేగిన మంటలు క్రమేపీ పక్కనే వున్న ఇళ్లకు కూడా పాకడంతో ఏడు ఇళ్లు దగ్ధమయ్యాయి. ఆ సమయంలో బాధిత కుటుంబాలకు చెందిన కొంతమంది శుభకార్యానికి వెళ్లగా మరి కొంతమంది ఎండవేడిమికి సమీపంలోని చెట్ల కింద సేదతీరుతున్నారు. ఈ సమయంలో మంటలు వ్యాప్తి చెందినట్లుగా బాధితులు తెలిపారు. కూనవరం నుంచి వచ్చిన ఫైరింజన్ సిబ్బంది, స్థానికులు మంటలను అదుపులోకి తెచ్చారు.

నష్టమిలా..

అగ్ని ప్రమాదంలో పులి బ్రహ్మయ్యకు చెందిన రూ.10 లక్షల నగదు, వరి నూర్పిడి యంత్రం, ట్రాక్టర్ టైర్లు, సామగ్రి దగ్ధమయ్యాయి. మిడియం భద్రమ్మకు చెందిన రూ.2 లక్షల నగదు అగ్నికి ఆహుతైనట్లు బాధితులు వాపోయారు. నాలుగు కుటుంబాలకు చెందిన బంగారు, వెండి వస్తువులతో పాటు 40 క్వింటాళ్ల ధాన్యం, 10 క్వింటాళ్ల బియ్యం, భూమి పట్టాలు, బ్యాంకు ఖాతా పుస్తకాలు, పిల్లల సర్టిఫికెట్లు, సెల్‌ఫోన్లు, నిత్యావసర వస్తువులతో పాటు ఇళ్ల సామగ్రి కాలి బూడిదైనట్లు బాధితులు వాపోయారు.

షార్ట్ సర్క్యూట్ వల్లే..?

బాధితులు ఇళ్లలో లేకపోవడంతో ప్రమాదం ఎలా జరిగిందనేది వారు చెప్పలేకపోతున్నారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగి ఉండవచ్చని వారు భావిస్తున్నారు.

బియ్యం, నిత్యావసర సరకుల పంపిణీ

ప్రమాద విషయం తెలుసుకున్న రంపచోడవరం ఓఎస్డీ మహేశ్వరరెడ్డి హుటాహుటిన చింతూరు ఏఎస్పీ రాహుల్‌మీనాను సంఘటన స్థలానికి పంపారు. బాధితులను పరామర్శించిన ఏఎస్పీ ప్రమాద వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం పోలీసుశాఖ తరఫున బాధితులకు కుటుంబానికి 25 కిలోల బియ్యం, నిత్యావసర సరకులను అందజేశారు. ఈ కార్యక్రమంలో సీఐ అప్పలనాయుడు, ఎస్ఐ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మన్యంలో విస్తారంగా వర్షాలు



పాడేరులో కురుస్తున్న వర్షం



యార్లగడ్డలో కూలిన విద్యుత్ స్తంభం

సాక్షి,పాడేరు: జిల్లాలోని పలు చోట్ల మరలా మూడు రోజుల నుంచి విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. శనివారం మధ్యాహ్నం నుంచి పాడేరుతో పాటు మండలమంతా ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది.పిడుగుల శబ్దాలతో ప్రజలు భయాందోళన చెందారు.పాడేరులోని కొంతమంది టీవీలు కూడా చెడిపోయాయి.పాడేరు పట్టణంలో కుండపోత వానతో జనజీవనానికి అంతరాయం ఏర్పడింది. పాడేరుతో పాటు హుకుంపేట, జి.మాడుగుల, పెదబయలు రోడ్డులో కుండపోత వానకు వాహనచోదకులు ఇబ్బందులు పడ్డారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలు ఖరీఫ్ వ్యవసాయానికి అనుకూలమని జిల్లా వ్యవసాయాధికారి నందు తెలిపారు. ఖరీఫ్ భూముల్లో దుక్కి పనులు చేపట్టాలని, మెట్ట పంటలకు ఈ వర్షాలు ఎంతో మేలు చేస్తాయని ఆయన పేర్కొన్నారు.

డుంబ్రిగుడ: మండలంలోని పలు ప్రాంతాల్లో ఆదివారం మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు ఉరుములు మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. దీంతో డ్రైనేజీ కాలువలు నిండిపోయి నీరు రోడ్లపైకి వచ్చేసింది. చాపరాయి గెడ్డ,సంపంగి గెడ్డలు పొంగి ప్రవహించాయి. మారుమూల ప్రాంతాల నుంచి మండల కేంద్రానికి వచ్చిన ప్రజలు ఇబ్బందులు పడ్డారు.

గాలి వానకు కూలిన విద్యుత్ స్తంభం


వై.రామవరం: మండలంలో ఆదివారం కురిసిన గాలి వానకు చెట్లు విద్యుత్ లైన్లపై కూలడంతో స్తంభాలు విరిగిపడ్డాయి. యార్లగడ్డ గ్రామంలో విద్యుత్ స్తంభం కూలిపోవడంతో లైన్లు తెగిపోయాయి. దీంతో ఆ గ్రామంతో పాటు పంచాయతీ పరిధిలోని శేషరాయి, గురమంద, కొమరవరం గ్రామాల్లో అంధకారం నెలకొంది. విద్యుత్ లైన్లకు మరమ్మతులు చేపట్టి సరఫరా పునరుద్ధరించాలని గ్రామ సర్పంచ్ పల్లాల పద్మావతి విద్యుత్‌శాఖ అధికారులను కోరారు.

గూడెంకొత్తవీధి: గూడెంకొత్తవీధిలో ఆదివారం కుండపోత వర్షం కురిసింది. ఏకధాటిగా సుమారు రెండు గంటలపాటు కురిసిన వర్షానికి లోతట్టుప్రాంతాలన్నీ జలమయం అయ్యాయి. ప్రధాన రహదారులపై వర్షపునీరు పొంగి ప్రవహించింది. విద్యుత్తు సరఫరాకు అంతరాయం ఏర్పడింది.

వడదెబ్బకు వృద్ధుడి మృతి

చింతూరు : వడదెబ్బకు గురై వృద్ధుడు మృతిచెందిన సంఘటన మండలంలోని రింగల గ్రామంలో ఆదివారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన మడకం రాజయ్య (60) ఎండ వేడిమికి గురై ఆదివారం సాయంత్రం స్పృహతప్పి పడిపోయాడు. దీంతో అతనిని చింతూరు ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గంమధ్యలో మృతిచెందినట్లు కుటుంబసభ్యులు తెలిపారు.

ఎయిడ్స్ రహిత సమాజానికి కృషి



పాడేరులో కొవ్వొత్తులతో ర్యాలీ

- డీఎంహెచ్‌వో జమాల్‌బాషా

సాక్షి, పాడేరు: ఎయిడ్స్ రహిత సమాజం కోసం పనిచేద్దామని డీఎంహెచ్‌వో డాక్టర్ జమాల్‌బాషా పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రమైన పాడేరులో ఆదివారం ప్రపంచ ఎయిడ్స్ దీపస్మృత్యాంజలి దినంను వైద్య ఆరోగ్యశాఖ నిర్వహించింది. డీఎంహెచ్‌వో జమాల్‌బాషా, జిల్లా హెచ్‌ఐవీ/ఎయిడ్స్ నివారణ అధికారి డాక్టర్ టి.విశ్వేశ్వరనాయుడు ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది అంబేడ్కర్ సెంటర్ నుంచి ఐటీడీఏ వరకు కొవ్వొత్తులతో ర్యాలీగా వెళ్లి పాతబస్టాండ్‌లో మానవహారం నిర్వహించారు. ఎయిడ్స్ మృతులకు శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ ఉమ్మడి విశాఖ జిల్లాలో హెచ్‌ఐవీ/ఎయిడ్స్ నియంత్రణకు వైద్య ఆరోగ్యశాఖ బృందాలు ప్రత్యేకంగా పనిచేస్తున్నాయన్నారు.ఉమ్మడి విశాఖ జిల్లాలో సుమారుగా 37,886మంది హెచ్‌ఐవీ/ఎయిడ్స్‌తో ఉన్నట్టు గుర్తించగా, వారిలో 17వేల 926మంది వైద్యబృందాల పర్యవేక్షణలో ఏఆర్‌టీ మందులు వాడుతున్నారన్నారు. వారంతా ఆరోగ్యంగానే ఉన్నారని ఆయన పేర్కొన్నారు. గత 15ఏళ్లలో సుమారు 9,298 మంది హెచ్‌ఐవీ/ఎయిడ్స్‌తో మృతిచెందారన్నారు. సక్రమంగా మూడు నెలలకు పైగా ఏఆర్‌టీ మందులు వాడే బాధిత రోగులకు వైఎస్సార్ పింఛన్ కానుక పథకం ద్వారా 3,544 మందికి నెలకు రూ.2,750 పింఛను పంపిణీ చేస్తోందన్నారు. జిల్లాకు సంబంధించి ఆరు ఏఆర్‌టీ కేంద్రాలతో పాటు లింక్ ఏఆర్‌టీ కేంద్రాల్లో హెచ్‌ఐవీ/ఎయిడ్స్ బాధితులకు చికిత్స అందిస్తున్నామన్నారు. ప్రభుత్వంలో వివిధ శాఖలు, స్వచ్ఛంద సంస్థలు కూడా బాధితులకు అన్ని విధాల సేవలతో పాటు పౌష్టికాహారపరంగా సహకారం అందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఆరోగ్య పర్యవేక్షకులు పి.శాంతారావు, జిల్లా గణాంక అధికారి కైలాసరావు, సూపరింటెండెంట్ చంద్రమౌళి, ఎయిడ్స్ నియంత్రణ మండలి ప్రతినిధి రామకృష్ణ, ఐసీటీసీ ఉద్యోగులు, ఓంశాంతి విద్యార్థినులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పర్యావరణ పరిరక్షణతో మానవ మనుగడ



ర్యాలీలో పాల్గొన్న ఎంపీపీ, రేంజర్, వైస్ ఎంపీపీ, సర్పంచ్ ఇతరులు

కొయ్యూరు: పర్యావరణ పరిరక్షణతో మానవ మనుగడ ముడిపడి ఉందని ఎంపీపీ బడుగు రమేష్ అన్నారు. అడవులను కాపాడుకుని వాటిని నరకకుండా చూసుకోవాలన్నారు. రాజేంద్రపాలెం, కొయ్యూరు వారపు సంతల్లో ఆదివారం పెదవలస రేంజర్ జగదీష్ ఆధ్వర్యంలో పర్యావరణానికి అనుకూలంగా జీవనం అనే అంశంపై ర్యాలీ నిర్వహించారు. ఎంపీపీ రమేష్ మాట్లాడుతూ ప్రపంచాన్ని నేడు భూతాపం భయపెడుతుందన్నారు. ప్రతీ ఒక్కరూ మొక్కలను నాటాలని సూచించారు. ప్రతీ ఒక్కరూ ప్లాస్టిక్‌ను నిషేధించాలన్నారు. రేంజర్ జగదీష్ మాట్లాడుతూ అడవులను రక్షించుకోని పర్యావరణాన్ని కాపాడుకోవాలని కోరారు. పచ్చదనం పెంపొందించాలన్నారు. వైస్ ఎంపీపీ అంబటి నూకాలు, సర్పంచ్ పీటా సింహాచలం, కొయ్యూరు ఫారెస్ట్ సెక్షన్ అధికారి సింహాద్రి, సిబ్బంది దుర్గా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

చెరువు నిండుగా.. చేను పండగ..

ప్రతి నీటి బొట్టును ఒడిసిపట్టి పరిరక్షించుకోవాలి. వ్యవసాయానికి అనుకూలంగా, ఆత్మబంధువుగా మార్చుకోవాలి. శివారు పంట పొలాలు సైతం నీరు లేక ఎండిపోయే పరిస్థితి ఉండకూడదన్నది ప్రభుత్వ లక్ష్యం. దీనికోసం 'ఏపీ సమీకృత సాగునీరు, వ్యవసాయ పరివర్తన పథకం' అమలు చేస్తోంది. ఈ పథకం కింద ఉమ్మడి విశాఖ జిల్లాలో 98 చెరువుల అభివృద్ధికి శ్రీకారం చుట్టింది. వీటిలో అనకాపల్లి జిల్లాలో అత్యధికంగా 73 చెరువులున్నాయి.

- 'సమీకృత వ్యవసాయ పరివర్తన' ద్వారా తీరనున్న సాగునీటి ఇబ్బందులు
- ఉమ్మడి విశాఖ జిల్లాలో 98 చెరువుల నిర్మాణం, ఆధునికీకరణ
- ప్రపంచ బ్యాంకు సహకారంతో 55, ఏపీఐఎల్ఐపీ సహకారంతో 43 చెరువుల అభివృద్ధి
- వీటి ద్వారా 12,828 ఎకరాల ఆయుకట్టుకు సాగునీరు
- 2025 నాటికి ప్రాజెక్టు పూర్తి చేయడమే లక్ష్యం



నిర్మాణ దశలో చెరువు



పనుల్లో నిమగ్నమైన కూలీలు

సాక్షి, అనకాపల్లి: చిన్న, సన్నకారు రైతులకు సాగు నీటి ఇబ్బందులు తీరనున్నాయి. వాతావరణంలో మార్పుల కారణంగా సకాలంలో రైతులు పంటలు పండించుకోలేని పరిస్థితులు నెలకొంటున్నాయి. నీటి సదుపాయం లేక పండించే పంటలకు ఆశించనంత మేర లాభాలను ఆర్జించలేకపోతున్నారు. పంటలు పండించేందుకు ముందస్తుగా తగిన నీటి సదుపాయం ఉంటే రైతు వ్యవసాయంలో తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు పొందడానికి ఆస్కారం ఉంటుంది. రైతుకు లాభసాటిగా ఉండేవిధంగా చెరువుల అభివృద్ధి, నిర్మాణ పనులకు రాష్ట్ర ప్రభుత్వం ముందడుగు వేసింది. సాగునీటి ఇబ్బందులు తొలగించడానికి రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో ఏపీ సమీకృత సాగునీరు, వ్యవసాయ పరివర్తన పథకం తీసుకొచ్చింది. 70 శాతం ప్రపంచబ్యాంకు నిధులు, 20 శాతం రాష్ట్ర ప్రభుత్వ నిధులతో సంయుక్తంగా చెరువుల నిర్మాణాలు చేపడుతోంది. ఇందులో స్వతంత్ర, గొలుసు కట్టు చెరువులు, వంద ఎకరాలపైగా ఆయకట్టు ఉన్న పెద్ద చెరువులు, చిన్న చెరువుల నిర్మాణ పనులు చేపడుతోంది. దీనిలో భాగంగానే ఉమ్మడి విశాఖ జిల్లాలో 98 చెరువుల అభివృద్ధికి శ్రీకారం చుట్టింది.

చెరువుకు రూ.30 లక్షల నుంచి రూ.70 లక్షలు..

2025 ఏడాది నాటికి ఈ ప్రాజెక్టు పూర్తి చేయాలన్న లక్ష్యంతో ప్రభుత్వం శరవేగంగా పనులు చేపడుతోంది. దాదాపు రూ.28 కోట్లతో ఉమ్మడి విశాఖ జిల్లాలో నిర్మాణ పనులు జరుగుతున్నాయి. వీటిలో 49 చెరువుల అభివృద్ధి పనులు దాదాపుగా పూర్తి కావచ్చాయి. ఒక్కో చెరువు నిర్మాణానికి అవసరం మేరకు రూ. 30 లక్షల నుంచి రూ.70 లక్షల వరకు కేటాయించారు. 18 చెరువులకు టెండర్లు కూడా పూర్తయ్యాయి. మిగిలిన 31 చెరువుల నిర్మాణాలకు పురోగతిలో ఉన్నాయి.

ఐదు శాఖల సహకారం

వాతావరణంలోని మార్పులను తట్టుకుని వ్యవసాయ ఉత్పాదకతను, ఆదాయాన్ని పెంచే విధంగా రైతులు పంటలను పండించడమే లక్ష్యంగా ఈ పథకాన్ని విస్తృతం చేశారు. వ్యవసాయ, భూగర్భజల, నీటిపారుదల, ఉద్యావన, మత్స్యశాఖ కలిసి సమీకృత సాగునీరు, వ్యవసాయ పరివర్తన పథకంలో చెరువుల నిర్మాణాలు చేపడుతున్నాయి.

అనకాపల్లి జిల్లా ...

ఏపీఐఐఏటీపీ పథకంలో భాగంగా 27 పనులకు (73 చెరువులు) రూ.33 కోట్లు ప్రభుత్వం మంజూరు చేసింది. వీటిలో 13 పనులకు(33 చెరువులు)కు గానూ రూ.20.84 కోట్లు ఖర్చుచేసింది. వీటి కారణంగా 7232 ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందుతుంది. 14 పనులకు గానూ ..ఐదు పనులకు (17 చెరువులు) టెండర్ ప్రక్రియ కూడా పూర్తయింది. మిగిలిన 9 పనులు(23) పురోగతిలో ఉన్నాయి.

రెండు లక్షల మంది రైతులకు లబ్ధి..

ఈ పథకంలో రైతులు సకాలంలో పంటలు వేసుకోవడం, ఏడాదికి మూడు పంటలు పండించుకునేందుకు వీలు కలుగుతుంది. వ్యవసాయ సామర్థ్యాన్ని పెంచుకోవడం, వాతావరణ సానుకూల పద్ధతులను ప్రోత్సహించడం జరుగుతుంది. ఈ పథకం ద్వారా ఉమ్మడి విశాఖ జిల్లాలో రెండు లక్షల మంది సన్న, చిన్నకారు రైతులకు లబ్ధి చేకూరనుంది. 25 శాతం వరకు పంట ఉత్పాదకతను, చెరువుల్లో చేపల ఉత్పాదకత 47 శాతం వరకు మెరుగుపరచుకోవచ్చనేది వ్యవసాయ, భూగర్భ వనరులశాఖ అధికారులు చెబుతున్నారు. చెరువులను అభివృద్ధి చేయడం ద్వారా భూగర్భ జలాల పెరుగుదల సాధ్యమవుతుంది.

విశాఖ జిల్లా...

ఏపీఐఐఏటీపీ కింద 7 పనులు (9 చెరువులు) పునరుద్ధరణకు రూ.1038 లక్షలు ప్రభుత్వం మంజూరు చేసింది. వీటిలో 5 పనులకు (7 చెరువులు)కు గానూ రూ.608.47 లక్షల ఒప్పందాలు ఖరారయ్యాయి. పనులు పురోగతిలో ఉన్నాయి. వీటి కారణంగా 986 ఎకరాల ఆయకట్టు స్థిరీకరించడం జరిగింది.

అల్లూరి జిల్లా...

ఏపీఐఐఏటీపీ కింద 6 పనులకు(16 చెరువులు) పునరుద్ధరణ కోసం రూ.336.70 లక్షలు ప్రభుత్వం మంజూరు చేసింది. వీటిలో 3 పనులకు(3 చెరువులు)కు గానూ రూ.206.36లక్షలకు ఒప్పందాలు ఖరారయ్యాయి. పనులు పురోగతిలో ఉన్నాయి. వీటి కారణంగా 1,150 ఎకరాల ఆయకట్టు స్థిరీకరించడం జరిగింది. ఏపీఐఐఏటీపీ పీడీ కె. రమేష్ బాబు మాట్లాడుతూ ఈచెరువుల అభివృద్ధి నిర్మాణపనులతో పంటల ఉత్పత్తులు పెంచుకోవడంతో పాటు రైతుకు ఆదాయం పెరుగుతుందన్నారు. వ్యవసాయానికి నీరు అందించే బోరుబావుల్లో వేసవి సమయాల్లో నీరు అడుగంటకుండా సహాయపడుతుందని పేర్కొన్నారు. అంతే కాకుండా భూగర్భ జలాలను నిల్వ చేయడానికి, వాటితోపాటు చేపల పెంపకంతో ఆదాయ వనరులు మెరుగు పడతాయన్నారు.

లోక కల్యాణార్థం పాదయాత్ర

జి.మాడుగుల: చింతపల్లి మండలం కృష్ణాపురం పాలకపాటి గురుదేవుల ఆశ్రమం నుంచి ఆదివారం శ్రీ రామానంద స్వామిజీ అధ్వర్యంలో ఐదు మండలాల్లో విశ్వశాంతి లోక కళ్యాణార్థం సనాతన ధర్మ పరిరక్షణార్థం పాదయాత్ర ప్రారంభమైంది. ఈ సందర్భంగా శ్రీ పాకలపాటి గురుదేవుల భక్తుల సంఘం అధ్యక్షుడు మత్స్యరాస మత్స్యరాజు మాట్లాడుతూ పాకలపాటి గురుదేవుల ఆశ్రమం శ్రీ రామానంద స్వామిజీ సనాతన ధర్మ పరిరక్షణార్థం చింతపల్లి, కొయ్యూరు, జీకె వీధి, జి.మాడుగుల, పాడేరు మండలాల్లో భక్తులతో రోజుకు 20 కిలోమీటర్లు చొప్పున నెల రోజుల పాటు పాదయాత్ర నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సంఘం నాయకులు ఈశ్వరరావు, రాంబాబు మాష్టర్, అడపా బాబూరావు, ప్రతాప్‌రుద్ర మాష్టర్, ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు భక్తులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఎంఎస్ఎంఈ పరీక్ష



పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న రిజిస్ట్రార్ కృష్ణమోహన్

ఏయూక్యాంపస్: ఎంఎస్ఎంఈ టెక్నాలజీ సెంటర్‌లో నిర్వహిస్తున్న అడ్వాన్స్ డిప్లమా ఇన్ డై-మౌల్డ్ మేకింగ్, అడ్వాన్స్‌డ్ డిప్లమా ఇన్ మెకట్రానిక్స్ అండ్ ఇండస్ట్రియల్ ఆటోమేషన్ కోర్సుల్లో ప్రవేశాలకు ఎంఎస్ఎంఈ సెట్-2023 ఆదివారం నిర్వహించారు. రెండు కోర్సుల్లో ప్రవేశాలకు విశాఖ, అనకాపల్లి, విజయవాడల్లో నాలుగు పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. మొత్తం 328 మంది దరఖాస్తు చేయగా 297 మంది పరీక్షకు హాజరయ్యారు. పరీక్ష కేంద్రాలను ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణ మోహన్ పరిశీలించారు. పరీక్ష నిర్వహణ బాధ్యతలను ఏయూ నిర్వహించింది.

లోయలోకి దూసుకుపోయిన కారు



డి.కుమ్మరిపుట్టు వద్ద ప్రమాదానికి గురైన కారు

ముంచంగిపుట్టు : మండలంలో గల దారెల పంచాయతీ డి.కుమ్మరిపుట్టు నుంచి ఢీంగూడ గ్రామాల మధ్య శనివారం ఆర్ధరాత్రి కారు అదుపు తప్పి లోయలోకి దూసుకుపోయింది. ఈ ప్రమాదంలో స్వల్ప గాయాలతో కారులో ఉన్న వారు బయటపడ్డారు. వివరాలిలా ఉన్నాయి. హైదరాబాద్‌కు చెందిన భార్యభర్తలు రాజేష్, మీనాక్షి డుడుమ జలపాతం చూడడానికి ఇక్కడకు వచ్చి తిరుగు ప్రయాణంలో దారెల గ్రామంలో బంధువుల ఇంటికి వెళ్తుండగా డి.కుమ్మరిపుట్టు సమీపంలో కారు అదుపు తప్పి రహదారి పక్కనున్న లోయలోకి దూసుకుపోయింది. దీంతో కారులో ప్రయాణిస్తున్న ఇద్దరికి స్వల్ప గాయాలు అయ్యాయి. రాత్రి దారెల గ్రామంలో తలదాచుకొని ఆదివారం ఉదయం దారెల సర్పంచ్ పాండు రంగస్వామి, గ్రామస్తుల సహకారంలో కారును లోయలో నుంచి బయటకు తీశారు.

తీర స్వచ్ఛత అందరి బాధ్యత



ప్రతిజ్ఞ చేస్తున్న మంత్రి గుడివాడ అమర్‌నాథ్, కలెక్టర్ మల్లికార్జున, సీపీ త్రివిక్రమ్ వర్మ తదితరులు

- మంత్రి గుడివాడ అమర్‌నాథ్
- మెగా బీచ్ క్లీనింగ్‌కు విశేష స్పందన

బీచ్‌రోడ్డు : సముద్ర తీర ప్రాంతాలు కలుషితం కాకుండా కాపాడుకోవాల్సిన బాధ్యత మన అందరిపై ఉందని రాష్ట్ర పరిశ్రమల, ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి, స్వచ్ఛత జన్‌భాగీదారి, సాగరతీర స్వచ్ఛత ఇండియా జీ-20 ప్రెసిడెన్సీ ఆధ్వర్యంలో ఆదివారం ఆర్కే బీచ్‌లో మెగా బీచ్‌క్లీనింగ్ నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ప్రారంభించిన మంత్రి మాట్లాడుతూ ప్లాస్టిక్ వ్యర్థాల వల్ల సముద్రతీర ప్రాంతాలు కలుషితం అవుతున్నాయని, వాటిపై దృష్టిసారించాలన్నారు. కలెక్టర్ మల్లికార్జున మాట్లాడుతూ ఆర్కేబీచ్ నుంచి వైఎంసీఏ వరకు బీచ్ క్లీనింగ్ చేపట్టినట్లు తెలిపారు. తీరానికి సందర్శనకు వస్తున్న వారు వ్యర్థాలను జీవీఎంసీ ఏర్పాటు చేసిన డస్ట్‌బిన్లలో వేయాలని సూచించారు. కాలుష్య నియంత్రణ మండలి సెక్రటరీ శ్రీధర్ మాట్లాడుతూ ప్లాస్టిక్ నియంత్రణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. పోలీస్ కమిషనర్ త్రివిక్రమ్ వర్మ మాట్లాడుతూ సాగర తీర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచడం అందరి బాధ్యత అన్నారు. కార్యక్రమంలో భాగంగా ఆర్కే బీచ్‌లో ఏర్పాటు చేసిన సైకిత శిల్పం ఆకట్టుకుంది. ఈ సందర్భంగా పర్యావరణ పరిరక్షణ కోసం అందరం కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ, డీసీపీ విద్యాసాగర్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

శారదానదిలో మునిగి యువకుడు మృతి



మహేష్ మృతదేహం

మునగపాక : సరదాగా స్నానం చేద్దామని నదిలోకి దిగిన యువకుడు మృత్యువాతకు గురైన దుర్ఘటన మండలంలోని గణపర్తిలో చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. విశాఖ మల్కాపురం బాపూజీ కాలనీకి చెందిన దనాల మహేష్(17)తన స్నేహితులతో కలిసి తీన్‌మార్ ప్రొగ్రామ్‌లో పాల్గొనేందుకు కశింకోట మండలం నరసింగబల్లి ఆదివారం వచ్చాడు. ఈ సందర్భంగా స్నేహితులతో కలిసి మహేష్ సమీపంలోని గణపర్తి శారదానదిలో స్నానం చేసేందుకు దిగాడు. దిగుతూనే ఈత రాకపోవడంతో ప్రమాదవశాత్తూ గల్లంతయ్యాడు. దీంతో తోటి స్నేహితులు ఆందోళనకు గురై కేకలు వేస్తూ బయటకు వచ్చేశారు. విషయం తెలుసుకున్న స్థానికులు మహేష్ కోసం గాలింపు చేపట్టారు. కొంతసేపటి తరువాత మహేష్ మృతదేహం లభ్యమైంది. మహేష్ మృతదేహాన్ని అనకాపల్లి వందపడకల ఆస్పత్రికి పోస్టుమార్టం కోసం తరలించారు. ఏఎస్ఐ రామకృష్ణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఏసీలో హాయ్ హాయ్!

- ఏసీ బస్సుల్లో ప్రయాణానికి మొగ్గు
- 80 శాతానికి పైగా చేరిన ఆక్యుపెన్సీ
- నాన్ ఏసీ సర్వీసులకు మించిన ఓఆర్
- ఆర్టీసీకి ఊరటనిస్తున్న వేసవి తాపం



సాక్షి, విశాఖపట్నం: వేసవి తాపం తాట తీస్తోంది. ఎండ మంట పుట్టిస్తోంది. వడగాడ్పులు బేజారెత్తిస్తున్నాయి. ఇళ్లలో ఉంటేనే సెగలు కక్కుతున్నాయి. ఇక ప్రయాణాల్లో పరిస్థితి మరింత దారుణంగా ఉంటోంది. ఒకపక్క స్కూళ్లు, కాలేజీలకు సెలవులొచ్చాయి. మరోపక్క పెళ్లిళ్లు కూడా ఊపందుకున్నాయి. దీంతో ఊళ్లకు, విహార యాత్రలకు వెళ్లే వారి సంఖ్య అధికమైంది. ఇలా ఊళ్లు వెళ్లే వారు ఉష్ణతాపం నుంచి ఉపశమనం పొందడానికి ఏసీ బస్సుల్లో ప్రయాణాలకు మొగ్గు చూపుతు న్నారు. మధ్య తరగతి, ఆపై స్థాయి ప్రయాణికులు నాన్-ఏసీ ప్రయాణంకంటే ఏసీ బస్సుల్లో ఎక్కువ చార్జీ అవుతున్నప్పటికీ వెనకడుగు వేయడం లేదు. ఫలితంగా ఆర్టీసీతో పాటు ప్రైవేటు ఏసీ బస్సుల్లోను సీట్లు, బెర్తులకు డిమాండ్ పెరుగుతోంది. గత నెలలో ఏపీఎస్ఆర్టీసీ ఏసీ సర్వీసుల్లో 50 శాతం ఆక్యుపెన్సీ రేషియో (ఓఆర్) ఉండగా ఇప్పుడది 80 శాతానికి పైగా చేరుకుంది. అదే సమయంలో నాన్-ఏసీ సర్వీసులకు కూడా ఓఆర్ పెరిగినా ఏసీ సర్వీసులతో పోల్చుకుంటే తక్కువగానే ఉంటోంది. గత నెలలో నాన్-ఏసీ బస్సుల్లో ఓఆర్ 60 శాతం ఉండగా ప్రస్తుతం 75 శాతం వరకు పెరిగింది.

అమలాపురం సర్వీసుకు 87 శాతం ఆక్యుపెన్సీ

విశాఖ జిల్లా నుంచి వివిధ ప్రాంతాలకు ఆర్టీసీ రోజుకు 30 ఏసీ బస్సులను నడుపుతోంది. వీటిలో హైదరాబాద్‌కు ఆరు, కాకినాడ, రాజమండ్రి, శ్రీకాకుళంలకు 16, విజయవాడ, కడప, అమలాపురంలకు ఎనిమిది చొప్పున వెళ్తున్నాయి. ఇవన్నీ 80 శాతం పైనే ఆక్యుపెన్సీతో నడుస్తున్నాయి. వీటిలో అత్యధికంగా విశాఖపట్నం నుంచి అమలాపురం ఇంద్ర ఏసీ సర్వీసుకు 87 శాతం, ఆ తర్వాత స్థానంలో విశాఖ నుంచి కాకినాడ, రాజమండ్రి, శ్రీకాకుళంలకు నడిచే మెట్రో లగ్జరీకి 85 శాతం ఆక్యుపెన్సీ రేషియో ఉంటోంది. అలాగే 84 శాతం ఓఆర్‌తో విజయవాడ అమరావతి సర్వీసుకు, 82 శాతం ఓఆర్ కడప ఇంద్ర ఏసీ సర్వీసుకు ఉంది. సగటున 80 శాతానికి మించి ఏసీ బస్సుల్లో ఆక్యుపెన్సీ లభిస్తుండడం ఆర్టీసీకి ఊరటనిస్తోంది. ఈ వేసవిలో ఏసీ బస్సుల్లో ప్రయాణాలు ఆశాజనకంగా పెరిగాయని, ఆర్టీసీకి లాభదాకమని విశాఖ జిల్లా ప్రజా రవాణా అధికారి (డీపీటీవో) ఎ.అప్పలరాజు 'సాక్షి'కి చెప్పారు. గత నెలతో పోల్చుకుంటే వీటిలో ఓఆర్ పెరుగుదల బాగుందని తెలిపారు.

ప్రైవేటు ఆపరేటర్లకు కాసుల పంట

వేసవి తాపం ప్రైవేటు బస్సు ఆపరేటర్లకు కాసులు కురిపిస్తోంది. రోజు రోజుకు ఎండల తీవ్రత పెరుగుతున్న కొద్దీ ఏసీ టికెట్లకు డిమాండ్ అధికమవుతోంది. దీనిని ప్రైవేటు ట్రావెల్స్ యాజమాన్యాలు 'క్యాష్' చేసుకుంటున్నాయి. ఏసీ స్లీపర్ విశాఖప ట్నం నుంచి విజయవాడకు రూ.1700-2200 వరకు, హైదరాబాద్‌కు రూ.2500 నుంచి 3200 వరకు వసూలు చేస్తున్నారు. అదే సీటయితే విజయవాడకు రూ.1300-1500, హైదరాబాద్‌కు డిమాండ్‌ను బట్టి రూ.2000-2500 వరకు తీసుకుంటున్నారు.

ఘనంగా మహానగర్ పథ సంచలనం

బీచ్‌రోడ్డు: ఆర్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన మహానగర్ పథ సంచలనం ఘనంగా జరిగింది. బీచ్‌రోడ్డులోని వైఎస్సార్ విగ్రహం నుంచి గోకుల్ పార్క్ వరకు వందలాది మంది ఆర్ఎస్ఎస్ సభ్యులు ర్యాలీగా కదిలారు. అనంతరం గోకుల్ పార్క్ వద్ద సభ నిర్వహించారు. పుట్టా శేషు సభను ఉద్దేశించి ప్రసంగించారు.

ఆగి ఉన్న ఆటోను ఢీకొట్టిన కంటెయినర్

యలమంచిలి : ఆగి ఉన్న ఆటోను కంటెయినర్ ఢీకొట్టిన ఘటనలో ఆటోలోని ప్రయాణికుడు మృతి చెందాడు. యలమంచిలి రూరల్ హెచ్‌సీ యర్రబ్బాయి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పాయకరావుపేట మండలం, ఇందిరా కాలనీకి చెందిన దువ్వాడ కృష్ణ (65) కూలి పని నిమిత్తం ఆటోలో వస్తుండగా ఆదివారం ఉదయం 6 గంటలకు యలమంచిలి మండలం, రేగుపాలెం సమీపంలో హైవేపై ఆటో టైరు పంక్చర్ కావడంతో రోడ్డు పక్కకు ఆపి మరమ్మతులు చేస్తున్నారు. ఇంతలో అటుగా తుని నుంచి యలమంచిలి వైపు వస్తున్న కంటెయినర్ వెనుక నుంచి ఆటోను ఢీకొట్టడంతో ఆటోలో వున్న కృష్ణ గాయపడ్డాడు. యలమంచిలి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి ప్రథమ చికిత్స అనంతరం అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. గాయపడిన ఆటో డ్రైవర్ విశాఖ కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్నాడని, బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని హెచ్‌సీ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

మాకవరపాలెం : ఆటోను బైక్ ఢీ కొట్టిన ప్రమాదంలో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. మండలంలోని జి.కోడూరుకు చెందిన కుటుంబ సభ్యులు ఆదివారం అనకాపల్లి నుంచి ఆటోపై మాకవరపాలెం వస్తున్నారు. అన్‌రాక్ రిఫైనరీకి వెళ్లే రోడ్డు వద్దకు వచ్చేసరికి బుచ్చింపేట మండలం కందిపూడికి చెందిన అప్పలనాయుడు(45)ఎదురుగా బైక్‌పై వస్తూ ఆటోను ఢీకొట్టాడు, ఈ ప్రమాదంలో ఆటోలో ఉన్న బి.ఎస్.పేటకు చెందిన ఆకుల ఆదిత్య(8)కు కుడి కాలు, చేయి విరిగిపోగా, చౌడువాడకు చెందిన సేనాపతి రాజులమ్మ(60)కు తీవ్రగాయాలయ్యాయి. అలాగే అప్పలనాయుడుకు కూడా ఎడమకాలు విరిగిపోయింది. వారిని 108లో నర్సీపట్నం ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేశామని ఎస్ఐ రామకృష్ణారావు తెలిపారు.

15 లీటర్ల సారాతో భార్యభర్తలు అరెస్టు



నాటుసారా విక్రయిస్తూ పట్టుబడిన వారితో ఎస్ఐ నాగేంద్ర

దేవరాపల్లి : వాలాబు పంచాయతీలో నాటుసారా విక్రయిస్తూ పట్టుబడిన భార్యభర్తలను ఆదివారం అరెస్టు చేసినట్టు దేవరాపల్లి ఎస్ఐ డి.నాగేంద్ర తెలిపారు. వాలాబుకు చెందిన జుత్తాడ పోతురాజు, సరోజిని నాటుసారా విక్రయిస్తున్నట్టు ముందస్తు సమాచారంతో దాడి చేయగా ఇద్దరూ ఇంటి వద్ద సారా విక్రయిస్తూ పట్టుబడ్డారని, వారి వద్ద నుంచి 15 లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. వారిని అరెస్టు చేసి చోడవరం కోర్టులో హాజరు పరచగా న్యాయమూర్తి విశాఖ సెంట్రల్ జైల్‌కు రిమాండ్ విధించారన్నారు.

రైలు నుంచి జారిపడి గుర్తు తెలియని వ్యక్తి మృతి



మృతదేహాన్ని పరిశీలిస్తున్న రైల్వే పోలీసులు

ఎస్.రాయవరం : నర్సీపట్నం రోడ్డు, గుల్లిపాడు రైల్వేస్టేషన్ల మధ్య రైలు నుంచి జారిపడి గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్టు తుని రైల్వే ఎస్ఐ షేక్ అబ్దుల్ మారుఫ్ ఆదివారం తెలిపారు. మృతుడి వయస్సు 50 సంవత్సరాలు ఉంటుందని, మృతదేహంపై నలుపు రంగు ప్యాంటు, తెలుపు రంగు చొక్కాపై నలుపు అడ్డగీతలతో కూడిన చొక్కా ఉందని తెలిపారు. తుని వైపు నుంచి విశాఖపట్నం వెళ్లే రైలు నుంచి ఉదయం జారిపడి ఉండవచ్చని చెప్పారు. మృతదేహాన్ని తుని ఏరియా ఆస్పత్రిలో భద్రపరిచామని, వివరాలు తెలిసిన వారు తుని రైల్వే పోలీస్‌స్టేషన్‌ని సంప్రదించాలని కోరారు.

50 కిలోల గంజాయితో ఇద్దరి అరెస్టు



గంజాయి నిందితులతో ఎస్ఐ శిరీష, సిబ్బంది

నక్కపల్లి : విశాఖ నుంచి రాజమండ్రి వైపు వెళ్తున్న కారులో తరలిస్తున్న 50 కిలోల గంజాయిని నక్కపల్లి ఎస్ఐ శిరీష తన సిబ్బందితో కలిసి స్వాధీనం చేసుకున్నారు. వేంపాడ టోల్‌గేట్ వద్ద ఆదివారం వాహనాలు తనిఖీ చేస్తుండగా కారులో 50 కిలోల గంజాయిని గుర్తించారు. మధ్యప్రదేశ్‌కు చెందిన షారుఖాన్, జాబిర్ అనే ఇద్దరు వ్యక్తులు 25 ప్యాకెట్లలో గంజాయి తీసుకెళ్తున్నారు. గంజాయి విలువ సుమారు రూ.80 వేలు ఉంటుందని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ చెప్పారు.